క్లుప్తంగా

మోడల్ పేపర్ల పంపిణీ



మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కే. బ్రాహ్మణపల్లి, కొండమనాయుని పాళెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు సోమవారం హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. మోడల్ పేపర్లను దాత అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటలక్ష్మీ సమకూర్చినట్లు సంస్థ అధ్యక్షుడు రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి,రాజ్ , సిద్దారెడ్డి, పద్మావతితో పాటు పలువురు పాల్గొన్నారు.

మోడల్ ప్రశ్నపత్రాల ఆవిష్కరణ

బత్తలపల్లి: పదవ తరగతి విద్యార్థుల ఉపయోగార్థం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన ఎస్‌ఎస్‌సీ–2024 మోడల్ పేపర్స్, పుస్తకాలను మండల విద్యాశాఖ అధికారులు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ ఆవిష్కరించారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఎమ్మార్సీ కార్యాలయంలో యూటీఎఫ్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ముద్రించిన ప్రశ్నాపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు అనిల్ కుమార్, రామ్మూర్తి, మహబూబ్‌బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా విద్యార్థులకు మెమొంటోలు



విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం అర్బన్: 4వ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో ఇటీవల బాలబాలికలు యోగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి మెమెంటోలు అందజేశారు. పట్టణంలోని సాంస్కృతిక మండలిలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక మండలి సభ్యుడు సత్రసాల ప్రసన్నకుమార్, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి, అనంతపురం జిల్లా యోగా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డితో కలసి ఆమె మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు యోగా చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను ప్రదర్శిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

ఎన్పీకుంట: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే వైజ్ఞానిక ప్రదర్శన ఉద్దేశమని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రిజ్వానుల్లాఖాన్ ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్.పీకుంట, ధనియానిచెరువు, టీ.ఎస్.పల్లి, గూటిబైలు, పాఠశాలల విద్యార్థులు సైన్స్, గణిత నమూనాలను ప్రదర్శించారు.

నేడు సీసీ రోడ్డు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ఎన్పీకుంట: మండల పరిధిలోని చీమలచెరువుపల్లికి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి మంగళవారం ప్రారంభించనున్నట్లు మండల ఎంపీపీ ఈటిరాము తెలిపారు. ఎన్.పీ.కుంట–పెడబల్లి ప్రధాన రహదారి నుంచి చీమలచెరువుపల్లి వరకూ నిర్మించిన సీసీ రోడ్డును ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



పేరూరులో గంగమ్మకు బోనాలు మోస్తున్న బెస్తసేవా సంఘం సభ్యులు

రామగిరి: మండలంలోని పేరూరులో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేక రంగుల పూలతో అలంకరించారు. అమ్మవారికి బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. బెస్తలు మాట్లాడుతూ పేరూరులో పెన్నానది తూర్పు నుంచి పడమరకు పారుతోందని, ఇలాంటి గంగమ్మ అరుదుగా ఉందన్నారు. ప్రతి సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏటా అమ్మవారికి పూజలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామగిరి మండల వాసులేగాక, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- పేదల అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



చిల్లవారిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

తాడిమర్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను ఇస్తున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిల్లవారిపల్లి, రామాపురం, కునుకుంట్ల గ్రామాల్లో బుధవారం ఆయన డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వర్థతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎమ్మెల్యేకు అపూర్వ ఆదరణ లభించింది. మహిళలకు హారతులు పట్టి ఆయనను ఆశీర్వదించారు. ముందుగా ఆయన చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిల్లవారిపల్లి, రామాపురం, కునుకుంట్ల గ్రామాల్లో ఆయన ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో దళిత, బడుగు, బలహీన వర్గాల వారికి సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా గుర్తింపును కల్పించిన ఘనత సీఎం జగన్‌దేన్నారు. నాడు–నేడు పథకం ద్వారా తాగు నీరు, విద్యుత్, అదనపు గదుల నిర్మాణం తదితర మౌలిక వసతులు కల్పించి కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. గత ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే పొందారన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు లంచాలు తీసుకుని అనర్హులకు సంక్షేమ పథకాలు అందించి, అర్హులకు అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో చిల్లవారిపల్లి, రామాపురం, కునుకుంట్ల సర్పంచులు పిట్టు పెద్దశివారెడ్డి, కుంటాల పుల్లయ్య, వడ్డి లావణ్య, ఎంపీటీసీ పెద్దన్న, మాజీ ఎంపీపీ వడ్డి గోపాల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్లు అల్లే సాయినాథ్‌రెడ్డి, మల్లప్పగారి మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు గరుడమ్మగారి రూపేష్‌రెడ్డి, గంగిరెడ్డి నారాయణరెడ్డి, పిట్టు పరమేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, సల్లాపురం బాలరమణారెడ్డి, యలక శ్రీనివాసరెడ్డి, వడ్డి లింగారెడ్డి, మదమంచి మల్లికార్జుననాయుడు, పాటిల్ ప్రకాష్‌రెడ్డి, ఆర్వేటి కాటమయ్య, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం హామీలు అమలు చేశారు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం: వందశాతం హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు, యువ నాయకుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని శివానగర్, కేశవనగర్ వార్డుల్లో సోమవారం సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాలు వివరిస్తూ మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, ధర్మవరానికి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలు ఎందుకు కావాలంటే అని కరపత్రాలను ప్రజలకు అందించి చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఐదేళ్ల కాలంలో ధర్మవరం నియోజకవర్గంలో రూ.5వేల కోట్లుతో అభివృద్ధి పనులు చేశారని రూ.2వేల కోట్లకుపైగా ప్రజల ఖాతాల్లోకి వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించామని ప్రజలకు వివరించారు. అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదలకు మెరుగైన వైద్యం



బత్తలపల్లి సచివాలయంలో సీఎం సందేశాన్ని ఆలకిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

బత్తలపల్లి: పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో మరిన్ని మెరుగులు దిద్దుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్తరించినట్లు ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని గ్రామ సచివాలయం–1లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెగా ఆరోగ్యశ్రీ విస్తరించే పథకాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీలతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగిరెడ్డి వీక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి, సీహెచ్ఓ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు తిరుపాల్, రవి, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రూ.25 లక్షల ఉచిత వైద్య సేవలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీలత

నల్లచెరువు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను కదిరి డీఎస్పీ శ్రీలత సోమవారం తనిఖీ చేశారు పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలని ఎస్ఐ లింగన్నకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల వెళ్లి విద్యార్థులకు బాల్య వివాహాలు, మహిళల హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐ షెక్షావలి ,కేజీబీవీ పాఠశాల పిన్సిపాల్ శిరీష ,సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ధ్వంసం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు వాటర్ ట్యాంక్‌తో పాటు నీటి కొళాయిలను ధ్వంసం చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఆకతాయిలు వాటిని ధ్వం చేశారన్నారు. ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. ,

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

గాండ్లపెంట: మండలంలోని పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ తరుపున 75 శాతం సబ్సిడీతో గడ్డి జాతి జొన్న విత్తనాలను అందజేయనున్నట్లు పశువైద్యాధికారి కేశవ నాయక్ తెలిపారు. కావాల్సిన రైతులు పశువైద్యశాలలో గడ్డి జాతి విత్తనాలకు కిలో రూ.92 కాగా సబ్సిడీ 69 పోనూ రూ.23 చెల్లించి తీసుకోవచ్చన్నారు.

ఆర్థికసాయం అందజేత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో చేనేత కార్మికుడు చింతా రమణదాస్ కుమారుడు ధర్మతేజ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కొద్దిరోజుల క్రితం విద్యుత్‌షాక్‌కు గురై బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శరీరం అంతా కాలడంతో సర్జరీ చేయడానికి దాదాపు రూ.10 లక్షల వరకూ ఖర్చుఅవుతుందని వైద్యులు తెలిపారని చేనేత కార్మికుడు రమణదాస్ ఆవేదన వ్యక్తంచేశాడు. సోమవారం జీవానంద పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు సేకరించిన రూ.50 వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. జీవానంద పాఠశాల నిర్వాహకులు జాయ్ కులంగర్, రాధాకృష్ణ, నాగేశ్వరరెడ్డి తదితరులు విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

మత్తుతో జీవితం చిత్తు

బత్తలపల్లి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి విద్యాలయంలో డ్రగ్స్, ఈవ్‌టీజింగ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి



అలంకరణలో సుబ్రహ్మణ్య నాగదేవతలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్ఎల్‌వీ మార్కెట్‌లో ఉన్న సుబ్రహ్మణ్య నాగదేవతల ఆలయంలో సోమవారం షష్టి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు విజయ్‌కుమార్ శర్మ, శంకర్‌శర్మ తదితరులు స్వాములకు క్షీరాభిషేకం, వెండి కవచం సమర్పణ, పుష్పాభిషేకం, నాగహారతి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామగిరి: మండలంలోని పేరూరులో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పెన్నానది ఒడ్డున ఉన్న స్వామికి ఈ ఏడాది నూతనంగా రథాన్ని భక్తుల సహాయంతో కొనుగోలుచేసి, ఊరేగించారు.

ట్యాబ్‌ల పంపిణీ

ఎన్పీకుంట: మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు బైజూజ్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎన్.పీ.కుంట, గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలతో పాటు మండెంవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం మంజూరు చేసిన 169 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీతాకుమారి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రిజ్వానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు



ధర్మవరంలో సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



ముదిగుబ్బలో మాట్లాడుతున్న ఇందుకూరు నారాయణరెడ్డి

ధర్మవరం: నవరత్నాల పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించి ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి సూచించారు. పట్టణంలోని 28వ వార్డులో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వారితో పాటు కౌన్సిలర్ సరితాల ఆశబి, సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాషా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పార్టీలు, కులమతాలు చూడకుండా టీడీపీ నాయకుల ఇళ్లకు కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్‌ను మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. అనంతరం వార్డులో చేసిన అభివృద్ధి పనుల బోర్డును విడుదల చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తంరెడ్డి, యల్లయ్య, కోఆప్షన్ సభ్యులు కరీమ్,నాయకులు కత్తె పెద్దన్న, సుబహాన్, శ్రీనివాసులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, చంద్రాయుడు, సేవే నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

నల్లచెరువు: మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం తహసీల్దార్ రవి కుమార్, ఎంఈఓ తిరుపాల్‌నాయక్ విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. పాఠశాలలోని వంట గది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శిరీష, వీఆర్‌ఏ పతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ధర్మవరం అర్బన్: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు కోసం న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం కొనసాగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో న్యాయవాదులు బాలసుందరి, బిల్లే రవి, కేసీ చంద్రమౌళి, రామానాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: కదిరి మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో అధికారులతో రెవిన్యూ, పంచాయతీ , సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి హౌసింగ్‌పై రివ్యూ నిర్వహించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చెందుకు ఇంటి పట్టాల పంపిణీ చేయడమే కాకుండా గృహ నిర్మాణానికి గృహాన్ని మంజూరు చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇంటి పట్టాలను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ జన్మదినం సందర్భంగా డిసెంబర్ 21న పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేసే లేఅవుట్‌లో పేదలకు ఇంటి పట్టాలను అందజేస్తామన్నారు. అందులో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రణీత్‌రెడ్డి, పరికి నజీమున్నీషా, మురళి, కౌన్సిలర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

లాటరీ పద్ధతిలో ఇంటి స్థలాల కేటాయింపు

కదిరి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా 21వ తేదీన పేదలందరికీ స్థలాలకు సంబంధించి పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలోని సోమవారం రాత్రి కదిరి మున్సిపాలిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో 2000 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి లాటరీ పద్ధతిలో స్థలాలు కేటాయించారు. సర్వే నెంబర్1, 21, 41, 1777ల్లో పేదలకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మా భూమి అక్రమంగా పట్టా చేయించుకున్నారు



మాట్లాడుతున్న రైతులు

చెన్నేకొత్తపల్లి: తాము సాగులో ఉన్న భూమిని టీడీపీ హయాంలో మాజీ మంత్రి పరిటాల సునీత ప్రోద్బలంతో పట్టా చేయించుకుని, దౌర్జన్యం చేస్తున్నామని ఆరోపించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. నామాల గ్రామానికి చెందిన రమాదేవి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామన్న విలేకరులతో మాట్లాడారు. నామాల గ్రామంలో గత 100 ఏళ్లుగా తమ పూర్వీకులు సర్వే నంబరు 172-6, 172-7, 172-8, 172-9లలో 4 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నామాల గ్రామానికి చెందిన కప్పల పెద్దక్క పేరున అక్రమంగా పట్టా పొంది, బ్యాంకులోనూ రుణం పొందారన్నారు. తాము ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే తామే సాగులో ఉన్నామని దర్యాప్తులో తేలిందన్నారు. భూమి దక్కదని అక్కసుతో వైఎస్సార్‌సీపీ నాయకులు దౌర్జన్యంగా భూమి లాక్కున్నారని పత్రికల్లో అసత్య కథనాలు రాయించడం సరికాదన్నారు. అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఎయిర్‌పోర్టు నూతన సీఐగా బొజ్జప్ప

పుట్టపర్తి టౌన్: సత్యసాయి ఎయిర్‌పోర్టు నూతన సీఐగా బొజ్జప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎయిర్‌పోర్టుకు వీఐపీలు అనేక మంది వస్తుంటారని భద్రతా విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. విధులు సమర్థవతంగా నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకరావాలన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లిలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ కొండన్న, సర్పంచ్ ప్రసాద్, వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మెన్ రఘునాథరెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ మురళీమోహన్ పాల్గొని ఉజ్వల పథకం లబ్ధిదారులకు నూతన గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు

ధర్మవరం అర్బన్: ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్నామని ఆర్టీసీ డీఎం వీఎస్ నారాయణ తెలిపారు. ధర్మవరం ఆర్టీసీ డిపోలో సోమవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్ట్ ఈపీకే, బెస్ట్ కేఎంపీఎల్, అర్నింగ్స్ బెస్ట్ మెకానిక్‌కు బహుమతులు అందించారు. డీఎం మాట్లాడుతూ కండక్టర్లు, డ్రైవర్లు డ్యూటీ చేసే సమయంలో ప్రయాణికులను గమనించి బస్సులో ఎక్కించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేషులు, గ్యారేజ్ ఇన్‌చార్జ్ సికిందర్, హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కదిరి రోటరీ క్లబ్ సభ్యుడు డాక్టర్ గణేష్ కిరణ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తనకల్లు ఎంఈఓ–2 కళ్యాణి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని యూటీఎఫ్ నాయకులు మోడల్ పేపర్స్‌ను రూపొందించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలోని 102 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం సురేష్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్ అలి, మండల అధ్యక్షుడు ఖాజా మొహిరుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. హెచ్ఎం భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. నల్లమాడ, యర్రవంకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆర్.రామాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఈనెల 22న జరిగే జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపికయ్యాయి. గ్రూప్ యాక్టివిటీలో నల్లమాడ, టీచర్ యాక్టివిటీలో ఆర్.రామాపురం, వ్యక్తిగత యాక్టివిటీలో యర్రవంకపల్లి పాఠశాలలు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఎస్పీకి అభినందనల వెల్లువ



ఎస్పీ మాధవరెడ్డి సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ఇటీవల ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు స్వీకరించిన ఎస్పీ మాధవరెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బంది సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో బెస్ట్ పోలీసింగ్, దిశ, శాంతి భద్రతల విషయంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, ఎస్పీ సీఐ రవీంద్రరెడ్డి, ఆర్ఐలు టైటాస్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు ప్రదీప్ సింగ్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగిద్దాం

ధర్మవరం అర్బన్: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకుందామని ఆ శాఖ డీఈఈ యు.నరసింహారెడ్డి సూచించారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డీఈఈ మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకుంటే భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూర్చిన వారమవుతామన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏడీ నరసింహారెడ్డి, ఏఈ నాగభూషణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

కనగానపల్లి: రాష్ట్ర స్థాయిలో గుంటూరులో జరిగిన యోగా పోటీల్లో కనగానపల్లి కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ఎస్ఓ నరసమ్మ తెలిపారు. సోమవారం ఎస్ఓ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా తరపున రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు హరిత, వంశిక, శ్రావ్య, హరిప్రియ, పూర్ణిమ బాగా రాణించి పతకాలు సాధించారన్నారు. వారిని ఎస్ఓతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.